క్లుప్తంగా

అభినందనలు



జేసీ తేజ్ భరత్‌కు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ సమర్థవంతంగా సేవలు అందించారని కలెక్టర్ కె.మాధవీలత అభినందించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో గురువారం ఆయనకు జ్ఞాపిక అందించి సత్కరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: బొమ్మూరు లైన్ మరమ్మత్తుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 6.30 నుంచి 8.30 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఆ సమయంలో మురళీకొండ, సాయిబాబా గుడి, సోమనవారి తోట, లెప్రసీ కాలనీ, కొత్తపేట, పాత బొమ్మూరు, ఏఎంజీ వెనుక వీధులలో విద్యుత్ ఉండదన్నారు.

11న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రంగంపేట: రంగంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 11న మధ్యాహ్నం 2 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీరామరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నతో పాటు మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. కావున మండల స్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి వివరాలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు–పైన రహదారిలో ఉన్న కాలువలో గురువారం అంబులెన్స్ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పందలపాక గ్రామానికి చెందిన ఓ ప్రైవేట్ నర్సింగ్ హోమ్ అంబులెన్స్ కాకినాడ వెళ్లి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో కాలువలోకి దూసుకుపోయింది. అయితే ఆ సమయంలో అంబులెన్స్‌లో రోగులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తెలిపారు.

ఘనంగా రత్తాలమ్మ తల్లి తీర్థం



ప్రత్యేక అలంకరణలో రత్తాలమ్మవారు

పెదపూడి: మండలంలోని వేండ్ర గ్రామంలో కొలువై ఉన్న రత్తాలమ్మ తీర్థం గురువారం ఘనంగా నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా ప్రసిద్ధి చెందిన రత్తాలమ్మ అమ్మవారి తీర్థానికి మండల నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. కొత్తగా వివాహం చేసుకున్న దంపతులు అమ్మ వారిని దర్శించుకుని వెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. తీర్థం సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

ఎమ్మెల్యే బలరామకృష్ణకు సన్మానం



ఎమ్మెల్యే బలరామకృష్ణ, వెంకటరమణ చౌదరిలను సత్కరిస్తున్న నాయకులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్‌లోని టీడీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకట రమణ చౌదరిలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించాయి. విజయోత్సవాల్లో భాగంగా గురువారం బలరామకృష్ణ ఇక్కడకు వచ్చారు. ఆయనకు వెంకటరమణ చౌదరి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ భూతం.. మనుగడకు విఘాతం..

- పెరిగిన ప్లాస్టిక్ వినియోగం
- డంపింగ్ యార్డుల్లో పేరుకుపోతున్న వ్యర్థాలు
- నిప్పు పెట్టడంతో మరింత ముప్పు



రోడ్డు పక్కన పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

కడియం: పర్యావరణాన్ని ప్లాస్టిక్ భూతం మింగేస్తోంది. భవిష్యత్తు తరాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తోంది. దాని ఆపడం మనం చేతుల్లో ఉన్నా, పట్టించుకోకపోవడం భారీ అనర్థానికి కారణం కానుంది. ఆస్తి, సంపదను మన పిల్లలకు ఇస్తున్నట్టే, వారు చక్కగా జీవించడానికి అనువైన పర్యావరణాన్ని కూడా అందించాలి. ఇది అందరికీ తెలిసినప్పటికీ ప్లాస్టిక్ నియంత్రణ, నిషేధం ప్రచారానికే పరిమితమవుతోంది. నిర్ణీత మైక్రాన్ల కంటే తక్కువగా ఉండే ప్లాస్టిక్ వస్తువులను వినియోగించడానికి వీల్లేదంటూ చట్టాలను చేసినప్పటికీ కూడా వాటిని అమలు చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చూసీచూడనట్టుగా వ్యవహరిస్తోంది. నివాస ప్రాంతాల నుంచి వచ్చే ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ యార్డుల్లోకి చేరుతున్నాయి. అక్కడ వాటికి నిప్పు పెట్టడంతో వాతావరణం కలుషితం అవుతోంది.

నీరుగారిన సంకల్పం

ఆవాస ప్రాంతాల నుంచి పోగయ్యే చెత్తతోనే పలు సమస్యలు ఉత్పన్నమవుతాయని గుర్తించి, వాటిని పర్యావరణ హితంగా డీ కంపోజ్ చేసేందుకు సమాయత్తమయ్యారు. ఇందుకోసం ఇళ్లవద్దే తడి, పొడి చెత్తగా సేకరించి, దాని నుంచి ఎరువులను తయారు చేయాలని సంకల్పించారు. ఇందులో వచ్చే ప్లాస్టిక్ వస్తువులనే వేరు చేసి పునర్వినియోగ వస్తువులుగా తయారు చేయాల్సి ఉంటుంది. ఇంత వరకు ప్రణాళిక బాగానే ఉంది. కానీ దానిని అమలు చేస్తున్న దాఖలాలు కన్పించడం లేదు. ఎప్పుడైనా పైనుంచి ఒత్తిడి వస్తే మాత్రం ఒకటి రెండు రోజులు కంపోస్టు తయారు చేస్తున్నట్లు, అమ్ముతున్నట్లు ప్రచారం మాత్రం చేస్తున్నారు. అంతే తప్ప ప్రతి రోజూ టన్నుల కొద్దీ పోగవుతున్న చెత్తను సక్రమంగా రీసైక్లింగ్ చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు.

పేరుకుపోతున్న ప్లాస్టిక్ కొండలు

రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని రూరల్, కడియం మండలాల పరిధిలో ఖాళీగా ఉండే ప్రాంతాలన్నీ డంపింగ్ యార్డులుగా మారిపోతున్నాయి. ఇవన్నీ ప్లాస్టిక్ కొండలను తలపిస్తున్నాయి. ఇరిగేషన్ కాలువ గట్టును కూడా ఇదే విధంగా వినియోగిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లోని నివాస గృహాల నుంచి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులోకి చేర్చి, నిప్పు పెడుతున్నారు. దీనివల్ల అత్యంత ప్రమాదకరమైన ప్లాస్టిక్ తదితర వస్తువులు సైతం కాలిపోయి గాలి కాలుష్యం పెరిగిపోతోంది. పాలీబ్యాగులతో పాటు ప్లాస్టిక్ మెటీరియల్‌ను కూడా నేరుగా డంపింగ్ యార్డుల్లోనే పడేస్తున్నారు. వీటిలో శానిటరీ నాప్ కిన్స్ మొదలుకుని, ఆసుపత్రి వ్యర్థాల వరకూ ఉంటున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఎటువంటి పర్యవేక్షణ, నియంత్రణ లేకుండా ఇలా డంపింగ్ యార్డుల్లోకి చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా ఆ ప్రదేశాల్లో భూమి, నీరు, గాలి కలుషితమవుతోంది.

నీటి పారుదలకు అడ్డంకులు

గోదావరి బ్యారేజీ ఎడమ కాలువ రూరల్ నియోజకవర్గంలోని ధవళేశ్వరం నుంచి ప్రారంభమవుతుంది. ఇక్కడి నుంచి కాకినాడ వైపు ఒక కెనాల్, కోటిపల్లి వైపు ఒక కెనాల్ ఉన్నాయి. ఈ రెండిటి నుంచి పొలాలకు నీరు అందుతుంది. ప్రస్తుతం ఈ కెనాళ్లకు అనుబంధంగా ఉన్న పిల్ల కాలువలన్నీ ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి. గ్రామాల్లోని మురుగు కాలువల్లోనూ అదే పరిస్థితి నెలకొంది. దీంతో సాగు, మురుగునీరు సక్రమంగా ముందుకు కదలక అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. ఒక వేళ కాలువ నీటిని నేరుగా పొలాలకు పారిస్తే వాటితో పాటు ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలు కూడా పొలాల్లోకి చేరుతున్నాయని రైతులు వాపోతున్నారు. రూరల్ నియోజకవర్గం పరిధిలో సాగు, మురుగు కాలువల్లోకి ప్రతి రోజూ చేరుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు దాదాపు టన్నుకు పైగా ఉంటాయని అంచనా. వీటిలో వాటర్ ప్యాకెట్లు, వాటర్, కూల్‌డ్రింక్ బాటిళ్లు, డిస్పోజబుల్ ప్లేట్లు, గ్లాసులు, క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ తాళ్లు, చెప్పులు ఉంటున్నాయి.



సాగునీటి కాలువను ఆక్రమించిన ప్లాస్టిక్ వ్యర్థాలు

నియంత్రణ అత్యవసరం

ప్రజా జీవితంలో భాగంగా మారిన ప్లాస్టిక్‌ను నియంత్రించాల్సిన అత్యవసర పరిస్థితి ఉందని పలువురు అంటున్నారు. వినియోగదారులు సైతం అవగాహన పెంచుకుని ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉండడమే దీనికి సరైన పరిష్కార మార్గంగా సూచిస్తున్నారు. ఈ తరహా మార్పు రాకపోతే మాత్రం ప్లాస్టిక్‌తో మరిన్ని భారీ సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

ప్రచారం చేసినా..

ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృతంగానే ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు రావడం లేదు. ప్లాస్టిక్ వినియోగం ఒక ఎత్తు అయితే, వాటిని వాడిన తర్వాత డంపింగ్ యార్డులకు చేరి మరింత ప్రమాదకరంగా మారుతున్నాయి.

– వీవీఎస్ శ్రీనివాస్, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు.

కఠిన చర్యలు

ప్లాస్టిక్ వినియోగించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నప్పుడు దాని వినియోగం తగ్గుతుంది. మార్కెట్లను వివిధ రకాల ప్లాస్టిక్ వస్తువులు ముంచెత్తుతున్నాయి. వినియోగానికి సౌకర్యవంతంగా ఉండడంతో ప్రజలు వీటి వైపు మొగ్గుచూపుతున్నారు. అంతిమంగా వచ్చే ప్రమాదాన్ని మాత్రం గుర్తించడం లేదు.

– టి.సత్తిబాబు, కడియం

రత్తాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే నల్లమిల్లి



వేండ్రలో రత్తాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి: మండలంలోని వేండ్ర గ్రామంలో రత్తాలమ్మ అమ్మవారి తీర్థం సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గండ్రేడులో నూకలమ్మవారిని, జి.మామిడాడలో జై జై నారాయణ ఆశ్రమంలో శివుడిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచి మొదటిసారి రావడంతో ఆయనకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జుత్తక కృష్ణ, తమలంపూడి శివరామారెడ్డి, బదిరెడ్డి చిట్టిబాబు, బదిరెడ్డి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

356 మందికి వైద్య సేవలు



నాగంపల్లిలో వైద్య సేవలు అందిస్తున్నడాక్టర్ రాజు

సీతానగరం: నాగంపల్లిలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 356 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సుందరి, ఏఎన్‌ఎం విశాలి, ఆశ వర్కర్లు విజయ, కుమారి పాల్గొన్నారు.

గెలుపు ఓటములు సహజం

- ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తాం
- ఎంపీ అభ్యర్థి డాక్టర్ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమికి కారణాలను సమీక్షించుకుని ముందుకు సాగుతామని వైఎస్సార్ సీపీ రాజమండ్రి ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావుతో కలసి గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదవులు శాశ్వతం కాదని, జీవితంలో కష్టాలు, శుభాలు ఉన్నట్లే ఎన్నికల్లోనూ జరుగుతుందని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజల మద్దతుతో అఖండ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి మేలు చేసిందని, కానీ ఎక్కడ లోపం జరిగిందో అంతు చిక్కడం లేదని చెప్పారు. ముఖ్యంగా పేదలు, మహిళలు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు లబ్ధి చేకూర్చేలా వివిధ పథకాలు అమలు చేశామన్నారు. అలవి కాని హామీలు ఇచ్చి టీడీపీ విజయం సాధించిందన్నారు. వీటిని ఎంతవరకూ అమలు చేస్తారో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెలల వరకూ చూస్తామని చెప్పారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజల తరఫున ప్రభుత్వంపై పోరాడతామని అన్నారు. పార్టీ కోసం రాత్రి, పగలు అనక కష్టపడి పని చేసిన నాయకులకు, కార్యకర్తలకు డాక్టర్ గూడూరి కృతజ్ఞతలు తెలిపారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాను ప్రకటించిన మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా నమ్మి అమలు చేశారన్నారు. టీడీపీ అమలు సాధ్యం కాని హామీలను ప్రకటించిందన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రజల్లో అపోహలు సృష్టించిందని చెప్పారు. ఈ అవాస్తవాలను నమ్మి ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. టీడీపీ ప్రకటించిన హామీలు అమలు చేసే వరకూ పోరాటం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తగరం సురేష్‌బాబు, వాకచర్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ కరాటే పోటీల్లో క్రీడాకారుల సత్తా



ఓపెన్ కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

ప్రకాశం నగర్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో రాజమహేంద్రవరం, ధవళేశ్వరానికి చెందిన క్రీడాకారులు సత్తా చాటి పలు పతకాలు సాధించారు. విక్టరీ సూటో, ఖాన్ కరాటే మాస్టర్స్ అకాడమీ ఆధ్వర్యంలో కాకినాడలో గురువారం నిర్వహించిన పోటీల్లో 8 నుంచి 18 ఏళ్ల వయసున్న బాల బాలికల విభాగంలో సీహెచ్ ప్రవళి, ఏ.పవన్, జె.నవ్య, సీహెచ్ జైదీప్, జె.శశాంత్, ఎన్.వీహాస్ సూర్య, కె.జాక్సాన్, పి.పూజ, ఎస్.శ్రీలక్ష్మీలత, ఎండీ ఆయేషా, పి.శ్రీరామ్, ఏ.అభిషేక్, కె.హర్షల్, కె.జయకర్, కె.దివాకర్ బంగారు పతకాలు గెలుచుకున్నారు. జె.నక్షత్ర, ఎ.పూజ, ఎస్.శరత్, ఎస్.నిఖిలేష్, కె.లాస్య, ఎ.కీర్తన, ఎస్.నిఖిలేష్ వెండి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ పిల్లి అరుణ్ కుమార్‌ను ఇండియా స్టైల్ చీఫ్ ఆర్.మల్లికార్జున్ గౌడ్ అభినందించారు.

వైభవంగా గురుచరిత్ర పారాయణ




బాలుడికి తులాభారం వేస్తున్న కుటుంబ సభ్యులు

రాజానగరం: శనీశ్వరుని జయంతి, అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక షిరిడీ సాయి బాబా ఆలయంలో గురువారం గురుచరిత్ర పారాయణ చేశారు. స్థానిక సాయి భక్తమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పారాయణ మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది. ఈ సందర్భంగా పరిసర గ్రామాల నుంచి వచ్చిన కొందరు భక్తులు తమ చిన్నారులకు బాబా సన్నిధిలో పటిక బెల్లం తులాభారం వేసి, మొక్కులు తీర్చుకున్నారు.

ఎంపీ అభ్యర్థికి కొవ్వూరులో అధికంగా ఓట్లు

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల్లో కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావుకి వచ్చిన ఓట్లు కంటే ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్ అదనంగా 3,037 ఓట్లు పోలయ్యాయి. 176 పోలింగ్ కేంద్రాల్లో కొన్ని చోట్ల క్రాసింగ్ ఓటింగ్ చేయడంతో ఎమ్మెల్యే అభ్యర్థికి 33 పోలింగ్ కేంద్రాల్లో మాత్రమే ఆధిక్యత లభించింది. ఎంపీ అభ్యర్థికి మాత్రం 46 పీఎస్‌ల్లో ఆధిక్యత లభించింది. ఎంపీ అభ్యర్థికి 61,834 ఓట్లు లభిస్తే ఎమ్మెల్యే అభ్యర్థికి మాత్రం 58,797 ఓట్లు దక్కాయి.

సినిమాలు



శ్యామల	సత్యభామ
సూర్యమినీ	ముంజ్యా
సూర్యప్యాలెస్	బ్యాడ్‌బాయ్స్
స్వామి	భజే వాయువేగం
శివజ్యోతి	రక్షణ
అనుశ్రీ	మనమే
రాజా	బ్యాడ్ బాయ్స్
ఊర్వశి	ఆ ఒక్కటీ అడక్కు
రంభ	లవ్ మౌళి, ప్రేమించొద్దు
మేనక	బాక్
అప్సర	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి	గంగం గణేశా
నామవరం	
వీఎస్ మహల్	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి, భజే వాయువేగం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కడియం	
వెంకటసూర్య	మనమే

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు సభ్యులు

కడియం: పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు తరఫున దివంగత నర్సరీ రంగ ప్రముఖుడు పల్ల వెంకన్న కుటుంబ సభ్యులు మండలంలోని పలువురు విద్యార్థులకు గురువారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. వెంకన్న 88వ జయంతిని పురస్కరించుకుని జాతీయ రహదారి పక్కనే కడియపులంకలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డీఈవో కె.వాసుదేవరావు మాట్లాడుతూ ట్రస్టు తరఫున విద్యాభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కడియం మండలంలోని తొమ్మిది హైస్కూళ్లలో పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు లక్ష రూపాయల మేరకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేయడం అభినందించారు. అలాగే విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు బి.సుధ, కె.జయలక్ష్మి, పి.సంధ్యారాణి, వీవీ ప్రసాదరావును సత్కరించారు. ఉప విద్యాశాఖాధికారి నారాయణ, కడియపులంక ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, నర్సరీ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, మాజీ అధ్యక్షుడు పుల్లా ఆంజనేయులు, స్థానిక ప్రముఖులు మార్గాని లక్ష్మీసత్యనారాయణ, పాటంశెట్టి చక్రవర్తి, పంతం గణపతి, ఎంఈవోలు వై.నాగేశ్వరరావు, మణికుమార్ పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు అందుకున్నది వీరే..

పదో తరగతిలో మండల ప్రథమం సాధించిన తాండ్ర హేమ (కడియం)కు రూ.10 వేలు, టి. శ్రీసాయిశ్రావ్యకు (మురమండ) రూ.7500, భాను ప్రకాష్, దుర్గా ప్రశాంతి, దుర్గా పావని, రాధిక, స్వాతి, హర్షిత, లక్ష్మీ వర్షిణి, అనూష, జ్యోతిక, సుభాషిణి, పవిత్ర, దుర్గాభవాని, సూర్యావతిలకు రూ. 5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందించారు. అలాగే వేమగిరి కొండపైగల బుద్ధ విహారాకు రూ.30 వేలు విలువైన మైక్‌సెట్‌ను బహూకరించారు. పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పల్ల సత్యనారాయణమూర్తి, సభ్యులు పల్ల సుబ్రహ్మణ్యం, గణపతి, పాతంశెట్టి చక్రవర్తి, వెంకటేష్, వినయ్, నర్సరీ రైతులు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని నడిపించిన రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ, డీఈవో వాసుదేవరావులను ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

మెట్ట మామిడి.. రుచిలో మేటి

- ఆశాజనంగా ధర
- దిగుబడి తగ్గడంతో పెరిగిన డిమాండ్



కోరుకొండలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మామిడి పండ్లు

మధురపూడి: వేసవి కాలంలో విరివిరిగా లభించే మామిడి పండ్లను ఇష్టపడని వారంటూ ఉండరు. పిల్లల నుంచి పెద్దల వరకూ దీని రుచిని ఆస్వాదిస్తారు. అందుబాటు ధరలో లభించే మామిడి అంటే అందరికీ మక్కువ ఎక్కువే. మెట్ట ప్రాంతంలో మామిడి పండ్లుకు రుచి ఎక్కువ. వాటిలో కోరుకొండ మండలంలో మామిడి పండ్లు ప్రత్యేక రుచి కలిగి ఉంటాయి. ఇక్కడి పండ్లు మాత్రమే కాదు, పచ్చడి కాయలకూ ఎంతో ప్రాధాన్యం ఉంది. దూర ప్రాంత వాసులు ఇక్కడి మామిడి కాయల కోసం వస్తారు. రాజానగరం నియోజకవర్గంలోని కోరుకొండ మండలంలో 1,500, రాజానగరం మండలంలో 1,100, సీతానగరం మండలంలో 120 హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి తోటలు ఉన్నాయి. ఈ సంవత్సరం దిగుబడి తగ్గడంతో ధర పెరిగింది.

మామిడి రకాలు

మామిడి పండ్లలో వివిధ రకాలు ఉన్నాయి. బంగినపల్లి, పెద్ద రసాలు, చెరకు రసం, హైదర్ సాహెబ్, పంచదార కల్తీ, కొత్తపల్లి కొబ్బరి, గోవా తదితర పేర్లతో వాటిని పిలుస్తారు. వీటిలో బంగినపల్లి, రసాలు, కొత్తపల్లి కొబ్బరి రకాలకు ఎక్కువ డిమాండ్ ఉంది. ఆవకాయ పచ్చడికి కొత్తపల్లి కొబ్బరి, రసాలు, హైదర్ సాహెబ్ కాయలను ఉపయోగిస్తారు. కోరుకొండ మండలంలోని కోటి కేశవరం, కణుపూరు, బొల్లెద్దుపాలెం, గరగలం పాలెం, నర్సాపురం, గాదరాడ, మధురపూడి, దోసకాయలపల్లి, బూరుగుపూడి, గుమ్ములూరు తదితర గ్రామాల్లో మామిడి పండ్లు రుచికి చిరునామాగా మారాయి.

తగ్గిన దిగుబడి

ఈ ఏడాది మామిడి తోటల దిగుబడి తగ్గింది. ఒక ఎకరం విస్తీర్ణం తోటలో సాధారణంగా 6 టన్నులు దిగుబడి రావాలి. కానీ ఈసారి దాదాపు మూడు టన్నులకు తగ్గిపోయింది. దిగుబడి తగ్గటానికి అనేక కారణాలు ఉన్నాయి. గతేడాది డిసెంబర్‌లో వచ్చిన తుపానుతో తోటలు దెబ్బతిన్నాయి. జనవరిలో సమయంలో వచ్చిన అకాల వర్షాలు, గాలి దుమ్ముల వల్ల పూత రాలిపోయింది. కొత్త పూత రావడానికి వాతావరణం అనుకూలించలేదు. దిగుబడి తగ్గడంతో మామిడి పండ్లకు డిమాండ్ బాగా పెరిగింది. సాధారణంగా కేజీ పండ్లు రూ.20 పలికితే, ఈ సంవత్సరం కేజీ పండ్లను రూ.50 నుంచి రూ.80కు విక్రయిస్తున్నారు.

కొమ్మల కత్తిరింపులు



మామిడి పండ్ల సీజన్ అనంతరం జూన్‌లో మామిడి తోటలలో దుక్కిదున్నాలి. దీనివల్ల చెట్టు బలపడంతో పాటు, వచ్చే సంవత్సరం దిగుబడి పెరగడానికి అవకాశం ఉంటుంది. సీజన్ పూర్తయిన తర్వాత మిగిలిపోయిన పురుగు మందులను చెట్టు బెరడు, కొమ్మల్లో పిచికారీ చేయాలి.

– రినీ, ఉద్యానశాఖ అధికారి, కోరుకొండ

ధర బాగుంది



ఈ ఏడాది మామిడి పండ్ల ధర బాగుంది. ఎకరం తోట కౌలుతో పాటు, పెట్టుబడి పెట్టి సాగు చేయడానికి సుమారు రూ.3 లక్షలు ఖర్చు అవుతుంది. అయితే పంట దిగుబడి బాగుంటే రూ.5 లక్షలు ఆదాయం వస్తుంది. గత సంవత్సరం ధర తగ్గిపోవడంతో ఆదాయం రాలేదు.

– తోట దుర్గారావు, మామిడి రైతు, గుమ్ములూరు